క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి వరదరాజనగర్‌కు చెందిన తన ఆత్మీయులు మునికృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి మృతి చెందడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి చలించిపోయారు. వారి ఇళ్ల వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విచ్చలవిడిగా గ్రావెల్ తరలింపు



తాటికోన ఎస్టీ కాలనీ సమీపం నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

చంద్రగిరి: అధికార పార్టీ నేతల అక్రమంగా మట్టి తరలింపు విచ్చలవిడిగా సాగుతోంది. మండల పరిధిలోని తాటికోన ఎస్టీ కాలనీ నుంచి గత మూడు రోజులుగా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. చంద్రగిరి సమీపంలో నిర్మిస్తున్న గోవిందధామం నిర్మాణానికి అధికారుల అనుమతితో గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతలు సుమారు 10 ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా రవాణా చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వెంచర్లు, ప్లాట్లకు మట్టిని తోలుకుంటున్నారని చెబుతున్నారు. అక్రమ గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంగమ్మ ఆలయ హుండీల లెక్కింపు



హుండీల కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గంగజాతర సందర్భంగా ఒకరోజు ఏర్పాటు చేసిన ఐదు తాత్కాలిక హుండీల ద్వారా రూ.10,69,618 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు ఆలయంలో అమ్మవారి హుండీ కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

తెలుగు ఉపాధ్యాయ పోస్టుల తొలగింపు తగదు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుంచి 8వ తరగతి వరకున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుల పోస్టులను తొలగించడం తగదని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాడ్లా ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు మీడియాన్ని పూర్తిగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. జాతీయ విద్యా విధానం మేరకు ఐఐటీ, ఎంబీబీఎస్ కోర్సులను తెలుగులో బోధించాలన్న నిబంధన ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో మాతృభాషకు పెద్దపీట వేస్తుంటే, ఇక్కడి ప్రభుత్వం మాతృభాషను పట్టించుకోకపోవడం ఉన్మాద చర్య అని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలని, తెలుగు ఉపాధ్యాయ పోస్టుల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి


తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం తమిళనాడు మాజీ సీఎం పళని స్వామి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పార్కింగ్ దోపిడీ

తిరుచానూరు పద్మావతి అమ్మవారి సమీపంలోని టూరిస్టు బస్టాండులో కాంట్రాక్టర్ దర్శనానికి వచ్చే భక్తుల నుంచి నిర్దేశించిన ధరల కంటే అధికంగా వాహనాల పార్కింగ్‌కు వసూలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఏకంగా అధిక వసూళ్లను బిల్లులు ముద్రించి మరీ దోపిడీకి దిగారు. పంచాయతీ వేలంలో తిరుచానూరు టూరిస్టు బస్టాండ్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం నెల రోజుల్లోనే తన పంథా షురూ చేశారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

పంచాయతీలో అడ్డగోలుగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న సిబ్బంది, ధరల పట్టికను టెండరు ఫారంలోనే ముద్రించిన అధికారులు





- పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద టూరిస్టు బస్టాండ్‌లో కాంట్రాక్టర్ దందా
- వాహనాల పార్కింగ్‌కు నిర్ణీత ధర కంటే అధికంగా వసూళ్లు
- బిల్లులు ముద్రించి మరీ దోపిడీ
- పంచాయతీలో ఎక్కడా కనిపించని ధరల పట్టిక బోర్డులు
- నోటీసులతో సరి పెడుతున్న పంచాయతీ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి దర్శనానికి నిత్యం 50 వేల మందికిపైగా భక్తులు వస్తుంటారు. వీరంతా సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చిన వారు అమ్మవారి ఆలయానికి వెళ్లే ముందే ఆలయం చుట్టూ ఉన్న రోడ్లు, పంచాయతీ వీధుల్లో ఎక్కడో ఒక దగ్గర వాహనాన్ని పార్కు చేయాల్సి ఉంటుంది. అక్కడ ప్రత్యేకించి పార్కింగ్ స్థలాలు ఏవీ లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. అయితే టూరిస్టు బస్టాండు ఏరియాతో పాటు నిర్దేశించిన కొన్ని ప్రాంతాల్లో పార్కింగ్ రుసుము వసూలు చేసే ప్రక్రియను ఎప్పటి నుంచో పంచాయతీ అధికారులు నిర్వహిస్తున్నారు. గత నెల రోజుల క్రితం పార్కింగ్ వసూలు చేసే కాంట్రాక్టును అధికార పార్టీకి చెందిన స్థానిక వ్యక్తి దక్కించుకున్నారు. గతంలో కంటే ఎక్కువకు వేలం పాడుకుని టెండరు దక్కించుకున్న ఆ వ్యక్తి అదనపు భారాన్ని భక్తులపై మోపుతున్నారు. పంచాయతీ నిర్ణయించిన ధరలను మాత్రమే వసూలు చేస్తానని లిఖిత పూర్వకంగా హామీ పత్రం రాయించిన సదరు వ్యక్తి కేవలం నెల రోజుల్లోనే దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అదనపు వసూళ్లతో భక్తుల జేబుకు చిల్లు

పంచాయతీ తరఫున వసూలు చేయాల్సిన పార్కింగ్ ఫీజుకు సంబంధించి వాహనాన్ని బట్టి ధర నిర్ణయించారు. ఆ ధరలను మాత్రమే కాంట్రాక్టరు వాహనదారుల నుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. పంచాయతీ తరఫున నిర్ణయించిన ధరల కంటే రూ.10, రూ.20, రూ.30 జీఎస్టీ పేరుతో అదనపు చార్జీలని ఏకంగా బిల్లులు ముద్రించి మరీ వసూళ్లకు పాల్పడుతుండడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పంచాయతీ అధికారులు, పోలీసులు వారు చేస్తున్న దోపిడీకి వంత పాడుతూ నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



కారుకు రూ.70 వసూలు చేయాల్సి ఉండగా రూ.80గా ముద్రించిన రసీదు

వసూలు చేయాల్సిన ధరలు ఇవీ..

గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం వాహనదారుల నుంచి వసూలు చేయాల్సిన ధరలు తిరుపతి- తిరుచానూరు మధ్య తిరిగే ప్రైవేటు బస్సుల పార్కింగ్‌కు రూ.100 వసూలు చేయాల్సి ఉండగా రూ.120 వసూలు చేస్తున్నారు. మెటాడోరు వాహనాలకు రూ.60కి బదులు రూ.70, కార్లు, జీపులు, క్వాలీస్ వాహనాలకు రూ.70 కాగా రూ.80, ట్రక్కు, ట్రాక్టర్ మొదలైన వాహనాలకు రూ.50 వసూలు చేయాల్సి ఉండగా రూ.70 వసూలు చేస్తున్నారు. ఈ అదనపు దోపిడీ మొత్తం పంచాయతీ అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా కళ్లుమూసుకుని వెళుతుండడం గమనార్హం.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 8 గంటలకు అమ్మవారి హుండీ లెక్కింపు (పరకామణి)
- అన్నమయ్య 618వ జయంతోత్సవాల సందర్భంగా ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు, సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రంలో భక్తి సంకీర్తనల కచేరీలు
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు బాలాజీ కాలనీలోని ఎస్వీ హైస్కూల్ మైదానం నుంచి ఇందిరామైదానం వరకు భారీ ప్రదర్శన, 5 గంటలకు బహిరంగ సభ

17 నుంచి వార్షిక వసంతోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు స్వర్ణరథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవర్లను ఆలయంలోని వసంత మండపానికి వేంచేపు చేసి ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, వీధి ఉత్సవం నిర్వహించనున్నారు. తొలి రెండురోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహించనున్నారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం అని అర్చకులు తెలిపారు.

నేటి నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

తిరుపతి కల్చరల్: ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జాతీయ మహాసభలను జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. బుధవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి కేంద్రంగా ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో పాల్గొనేందుకు 24 రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున యువత రానున్నట్లు చెప్పారు. విద్య, ఉపాధి, నిరుద్యోగ సమస్య, నిరుద్యోగ భృతి సాధన వంటి అంశాలపై మహాసభల్లో చర్చించి వాటి సాధనకు పోరాటాలు చేసేందుకు సన్నద్ధం కానున్నట్లు తెలిపారు. తొలి రోజు గురువారం సాయంత్రం బాలాజీ కాలనీలోని ఎస్వీ హైస్కూల్ మైదానం నుంచి ఇందిరా మైదానం వరకు భారీ ప్రదర్శన ఉంటుందని, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. పెద్దఎత్తున యువత హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నారాయణ, జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర, సహాయ కార్యదర్శి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈఓగా హరీంద్రనాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న హరీంద్రనాథ్

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈఓగా హరీంద్రనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమల రిసెప్షన్ డిప్యూటీ ఈఓ ఆర్–2గా ఉన్న హరీంద్రనాథ్ ఇటీవల తిరుచానూరు ఆలయ ఈఓగా టీటీడీ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పద్మావతి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈఓగా పనిచేసిన గోవిందరాజన్‌కు పూర్తిస్థాయి హెచ్‌ఆర్ డిప్యూటీ ఈఓగా బాధ్యతలు కేటాయించారు.

అన్నమయ్య కీర్తనలతో పరబ్రహ్మ దర్శనం





మాట్లాడుతున్న మేడసాని మోహన్, భక్తి సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారిణి

తిరుపతి కల్చరల్: అన్నమయ్య తన సంకీర్తనలతో సామాన్యులకు పరబ్రహ్మ స్వరూపాన్ని చూసిన అనుభూతి కల్పించారని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఆచార్య చెన్నప్ప తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న తాళ్లపాక అన్నమయ్య 617వ జయంతి ఉత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ×అన్నమయ్య సంకీర్తనలు –బ్రహ్మ సాక్షాత్కారం× అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తిభావాన్ని చైతన్య పరిచి శ్రీవేంకటేశ్వరస్వామివారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించి వ్యాప్తి చేశారన్నారు. అనంతరం తిరుపతికి చెందిన విశ్రాంత ఆకాశవాణి సంచాలకుడు మల్లేశ్వరరావు ×అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక సందేశం× అనే అంశంపై మాట్లాడారు. నగరి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకురాలు వరలక్ష్మీ మాట్లాడుతూ ×అన్నమయ్య– తాత్వికత× అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో సుశీల బృందం ప్రదర్శించిన భక్తి సంగీత సభ, ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాస్ బృందం ప్రదర్శించిన హరికథాగానం సభికులను అలరింపజేసింది. అలాగే మహతి కళాక్షేత్రంలో అనూష, ఆర్తి కళా బృందం, తిరుపతికి చెందిన అన్నపూర్ణ గాత్ర కచేరీలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, నగరవాసులు పాల్గొన్నారు.

కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు

తిరుపతి కల్చరల్: కూటమి పార్టీలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులతో కలిసి రాజకీయ ప్రత్యామ్నాయం వేదికను సిద్ధం చేయనున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. బుధవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్ బీజేపీకి వ్యతిరేకంగా ఒక్క మాటైనా మాట్లాడగలరా ? అని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీని నిలదీస్తే తప్పేముందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యేక వేదికపై నుంచి ఉద్యమించనున్నట్లు తెలిపారు. మార్క్సిజం, లెనినిజం ప్రపంచ వ్యాపిత సిద్ధాంతమని చర్చలకు నక్సల్స్ సంసిద్ధత వ్యక్తం చేసినా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఖాతరు చేయకపోవడం, 2025 నాటికి అంతం చేస్తామని ప్రకటించడం పట్ల మండిపడ్డారు. ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రమూకలను ప్రోత్సహిస్తున్న పాక్‌తో చర్చలకు సిద్ధమైన కేంద్రం నక్సల్స్‌తో చర్చలకు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరోచిత పోరుకు నాయకత్వం వహించిన కల్నల్ సోఫియాను బీహార్ బీజేపీ ఎంపీ హేళన చేయడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పెహల్గాం ఘటనలో నిఘా వ్యవస్థ లోపం కనిపిస్తోందన్నారు.

ఆక్రమించిన భూములు అప్పగించు



మాట్లాడుతున్న తిరుపతి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి

- ప్రతి పంచాయతీలో తుడా కట్టించిన భవనాలు, పార్కులు తీసుకుంటారా ?
- తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర రెడ్డిపై వైఎస్సార్‌సీపీ నేతలు ఫైర్

తిరుపతి రూరల్: ''నువ్వు ఆక్రమించిన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించు.. అలాగే పెరుమాళ్లపల్లిలో తుడా తరఫున కట్టించిన భవనాలను కూడా తుడాకు ఇచ్చేద్దామా..? ప్రతి పంచాయతీలో తుడా నిధులతో భవనాలు, పార్కులు నిర్మించారు.. ఇతర శాఖలకు కేటాయించిన తుడా నిధులను వెనక్కు తీసుకురాగలరా..? వీటన్నింటికీ సమాధానం చెప్పు ఈశ్వర్‌రెడ్డి'' అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర రెడ్డి ఫైర్ అయ్యారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజుల కిందట మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి చేసిన అసత్య ఆరోపణలు, వ్యంగ్యంగా మాట్లాడడాన్ని తప్పుబట్టారు. పెరుమాళ్లపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఎంతో కాలంగా తన ఆధీనంలో పెట్టుకున్న ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ పడితే అక్కడ భూ ఆక్రమణలకు పాల్పడుతున్న ఈశ్వర్‌రెడ్డి ఎదుటి వారికి అవినీతి మరకలు అంటించే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. పుదిపట్ల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 466/ఎలో 1.87 ఎకరాలు, 442/1 0.54 ఎకరాలు, 442/6 0.62 ఎకరాలు, 442/3లో 0.58 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసి, ఇటుకల తయారీ వారికి అప్పగించి ప్రతి నెలా వేలల్లో అద్దె వసూలు చేసుకునే తెలివితేటలు ఆయనకు మాత్రమే ఉన్నాయన్నారు. ఒకసారి తుడా నుంచి పంచాయతీకి అప్పగించిన ఆస్తులను, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను వెనక్కు తీసుకోగలరా..? తుడాకు పంచాయతీలపై పెత్తనం ఉంటే తుడా నిధులతో పనులు చేయకముందే పంచాయతీ తీర్మాణాలు ఎందుకు తీసుకుంటుందో ఆయన చెప్పాలన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు తుడా ఛైర్మన్‌గా పనిచేసిన చెవిరెడ్డిపై విమర్శలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఒక్క చంద్రగిరిలోనే కాకుండా శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు నియోజక వర్గాల పరిధిలో ఎన్నో పార్కులు, భవనాలు తుడా తరఫున కట్టించారని, వాటన్నింటినీ తుడా వెనక్కు తీసుకోగలదా ? అని ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలోని భూముల్లో తుడా నుంచి నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసినప్పటికీ నిర్వహణ బాధ్యతలను ఆయా పంచాయతీలకే అప్పగించడం ఎప్పటి నుంచో జరుగుతోందన్నారు.

తుడా పదవి రాలేదని మతి భ్రమించిందా..?

ఎమ్మెల్యే పులివర్తి నాని గత పది నెలలుగా తుడా ఛైర్మన్ పదవి కోసం చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించకపోవడంతో ఈశ్వర్‌రెడ్డికి మతి భ్రమించినట్టు ఉందని మునీశ్వరరెడ్డి అన్నారు. ఇకనైనా చెవిరెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, విచక్షణ మరచి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు చిన్నియాదవ్, పెరుమాళ్లపల్లి సర్పంచ్ జోగి మోహన్, ఉప సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పించిన ముస్లింలు



రాజీవ్‌గాంధీకాలనీలోని గంగమ్మకు సారె సమర్పిస్తున్న ముస్లింలు

తిరుపతి మంగళం : మతోన్మాదం, మారణ హోమం, మానవత్వం మరిచిన మృగాలు, నరరూప రాక్షసుల నుంచి మా భారతదేశాన్ని కాపాడి హిందూ ముస్లింలు కలిసిమెలిసి బతికేలా దీవించాలని గంగమ్మ తల్లికి మొక్కుకున్నట్లు ఆల్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు రఫీ హిందూస్తానీ తెలిపారు. బుధవారం తిరుపతి జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీల్లో గంగ జాతర ఘనంగా జరిగింది. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా రాజీవ్‌గాంధీ కాలనీలో వెలసిన గంగమ్మకు స్థానికులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జీవకోన రాజీవ్‌గాంధీకాలనీలోని గంగమ్మకు స్థానిక ముస్లింలు సారె సమర్పించడం కొసమెరుపు. ఈ సందర్భంగా రఫీ హిందూస్థానీ మాట్లాడుతూ బీబీ నాంచారమ్మ తమకు సోదరిగా వెంకటేశ్వరస్వామి బావగా ఉన్నందున స్వామివారి సోదరి గంగమ్మ తల్లికి ముస్లింలంతా కలిసి సారె సమర్పించడం జరిగిందన్నారు. ఈ వేడుకల్లో రెడ్డి బాష, రియాజ్ బాషా, మహమ్మద్ అలీ, సాధిక్ బాష, సాబ్ జాన్, కలీం, అలీమ్, మహబూబ్ బాషా, సాజిదా, సాబీరా, షాజహాన్, అనీషా, జిలాని, ఫయాజ్, నజీర్, కమిటీ సభ్యులు, ముస్లిం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్), అనుబంధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా సంస్కరణల పేరిట కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగంపై దాడి చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను, గ్రామీణ హర్తాల్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వారు సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.వెంకటరత్నం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులు, కర్షకుల ప్రయోజనాలను పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను తీసుకువస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ ఎం.అరుణ, ఐఎఫ్‌టీయూ తిరుపతి కన్వీనర్ లోకేష్, అంగన్‌వాడీ నాయకురాలు గంగాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

తిరుపతి అర్బన్ : వేసవి నేపథ్యంలోతాగునీటి సమస్యల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీరు విజయకుమార్‌ను ఆదేశించారు. జెడ్పీ, ఎంపీ నిధులతో వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీ రోడ్లు పూర్తి చేయడంలో జాప్యం లేకుండా చూడాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌ను ఆదేశించారు.

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం యల్లమంద వద్ద కారులో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకట్రమణ తెలిపారు. కారుతో సహా పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందన్నారు. ఎఫ్‌ఎస్‌ఓలు మునస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్, ప్రభుతేజ పాల్గొన్నారు.